

కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, రేణుక దంపతులను సన్మానిస్తున్న నల్లా రఘుమారెడ్డి దంపతులు

హనుమాన్ ఆలయంలో త్రిపుర గవర్నర్ పూజలు

చంపాపేట, మే 9(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయాన్ని శుక్రవారం త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, రేణుక దంపతులు సందర్శించారు. ఆలయ పండితులు, అర్చకులు గవర్నర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలోని వినాయక, ధ్యానాంజనేయస్వామి ఆలయాలలో గవర్నర్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు, వేదపండితులు గవర్నర్ దంపతులకు వేదాశీర్వచనం అందించారు. ఆలయ మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి సుమిత దంపతులు గవర్నర్ దంపతులకు శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం సాయిరాం నగర్‌కాలనీలోని నల్ల రఘుమారెడ్డి గృహంలో గవర్నర్ దంపతులు అల్పాహారం తీసుకున్నారు. గవర్నర్ దంపతులను నల్లా రఘుమారెడ్డి దంపతులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ ధర్మకర్తలు బిల్లకంటి కిరణ్‌కుమార్‌గుప్తా, బీసుకుంట్ల సతీష్‌గౌడ్, చీర తిరుమలేష్, సామ రంగారెడ్డి, యాదగిరి, కాలనీ ప్రతినిధులు సురంజన్‌రెడ్డి, అనుముల రవీందర్‌రెడ్డి, ముకుందరెడ్డి, శేఖర్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేకు జ్ఞాపికలను అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠ

- పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే

అబ్దుల్లాపూర్‌మెట్, మే 9(ఆంధ్రజ్యోతి): బాటసింగారంలోని పోతులూరీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ ప్రతిష్ఠ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎంపీ, ఎమ్మెల్యేకు తీర్థ ప్రసాదములు అందించగా నిర్వాహకులు శాలువాతో సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.



ఎరుకల నాంచారమ్మ జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మధుయాష్కీగౌడ్

నేటి నుంచి ఎరుకల నాంచారమ్మ జాతర

- వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన మధుయాష్కీగౌడ్

మన్సూరాబాద్, మే 9(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం పిలాయిపల్లి గ్రామం స్వయంభువుగా వెలసిన ఎరుకల నాంచారమ్మ జాతరను నేటి(శనివారం) నుంచి 12వ తేదీ సోమవారం వరకు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ పేర్కొంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతీ ఏటా అధికారికంగా నిర్వహించే జాతరకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఎల్బీనగర్‌లోని తన నివాసం వద్ద బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ ఆవిష్కరించారు. ఉత్సవ కమిటీ సభ్యుడు బుడ్డ సత్యనారాయణ మాట్లాడుతూ ఎరుకల నాంచారమ్మ జాతరను ప్రతి ఏటా ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తూ వస్తోందని, ఈ జాతరకు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. ఈసారి వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సకల సదుపాయాలు కల్పించామన్నారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో రాంపల్లి నర్సింహ, బన్నాపురం రఘు, కండెల వెంకటేష్, మండపం గోపాల్, నారాయణ, విశ్వనాథ్, చిరుమర్తి శేఖర్, నల్లగొండ శ్రీనివాస్, బిజిలి సదానందం, రాధాకృష్ణ, కోనేటి వీరేశం పాల్గొన్నారు.



ప్రార్థన కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ సంఘ్ చాలక్ సుందర్‌రెడ్డి

సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర కీలకం

సైదాబాద్, మే 9(ఆంధ్రజ్యోతి): సమాజంలో విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో గురువులు కీలకపాత్ర వహించి మార్గదర్శకులుగా నిలుస్తున్నారని రాష్ట్రీయ స్వయం సేవక్(ఆర్‌ఎస్‌ఎస్) తెలంగాణ ప్రాంత సంఘ్ చాలక్ బర్ల సుందర్‌రెడ్డి అన్నారు. సరస్వతీనగర్‌కాలనీలో తెలంగాణ ప్రాంత సరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో ఏప్రిల్ 28 నుంచి మే19 వరకు శిశువాటిక ఆచార్య ప్రశిక్షణ వర్గ-2025 తరగతులు కొనసాగుతున్నాయి. శుక్రవారం జరిగిన కార్యక్రమానికి సుందర్‌రెడ్డితో పాటు బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు తోట అమర్నాథ్‌రెడ్డి, బీజేపీ అధికార ప్రతినిధి వీరేందర్ బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రస్తుత సాంకేతిక విప్లవయుగంలో సాంకేతిక చేరువైనందున గురువులు అందిపుచ్చుకుని విద్యార్థుల్లోని సృజనాత్మకతను నైపుణ్యాలను వెలికితీసేందుకు దృష్టిపెట్టాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రబంధకారిణి కార్యదర్శి గడ్డం దశరథరెడ్డి, వర్గ ప్రతినిధి రవీందర్‌జీ, ప్రధానాచార్యులు శివలీల, ఆచార్యులు మానస, సంధ్య పాల్గొన్నారు.

నేడు బడంగ్‌పేట్‌లో ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావంగా ర్యాలీ

- పాల్గొననున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్, మే 9(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొంటున్న భారత సైనికులకు సంఘీభావంగా శనివారం సాయంత్రం మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ఆధ్వర్యంలో బడంగ్‌పేట్‌లో ర్యాలీ నిర్వహించనున్నట్టు బీఆర్‌ఎస్ బడంగ్‌పేట్ కార్పొరేషన్ శాఖ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం 5గంటలకు బడంగ్‌పేట్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి బాలాపూర్ చౌరస్తా వరకు ఈ ర్యాలీ ఉంటుందని, ఎమ్మెల్యే సబితారెడ్డి సైతం హాజరవుతారని, పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ ఈ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మధ్యాహ్న భోజన కార్మికురాలి మృతి

అబ్దుల్లాపూర్‌మెట్ : మండలంలోని బాటసింగారం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం కార్మికురాలుగా పని చేస్తున్న పి. పారిజాత అనారోగ్యంతో గురువారం రాత్రి మృతిచెందింది. ఈ సందర్భంగా జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం మల్యాల యాదగిరితో పాటు ఉపాధ్యాయుల బృందం ఆమె మృతిపట్ల సంతాపం ప్రకటించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

ఎండల్లో హాయ్.. హాయ్..

కళకళలాడుతున్న స్విమ్మింగ్ పూల్స్

సేద తీరుతున్న చిన్నారులు, పెద్దలు



స్విమ్మింగ్ డ్రెస్‌లో బుడతడు



చంపాపేటలోని స్విమ్మింగ్ పూల్‌లో చిన్నారుల సందండి



ట్యూబ్‌లతో చిన్నారుల కేరింతలు



ఎంజాయ్ చేస్తున్న బాలుడు



చిన్నారికి రక్షణగా తల్లి

సైదాబాద్, మే 9(ఆంధ్రజ్యోతి): ఓ పక్క విద్యార్థులకు సెలవులు.. మరో పక్క పెరిగిన ఉష్ణోగ్రతలతో ఉపశమనం పొందడానికి స్విమ్మింగ్ పూల్స్‌కు క్యూకడుతున్నారు. అంతేగాకుండా ఈత నేర్చుకోవడానికి వేసవి కాలం ఓ చక్కని అవకాశం, కావున చిన్నా, పెద్ద తేడా లేకుండా ఆసక్తి చూపుతున్నారు. దీంతో స్విమ్మింగ్ పూల్స్ అన్నీ ఈతగాళ్లతో కలకలాడుతున్నాయి. ముఖ్యంగా కళ్లకు రక్షణగా అద్దాలు, తలకు ప్లాస్టిక్ కవర్లు పెట్టుకుని నీళ్లలో ఆటలతో మురిసిపోయే చిన్నారులతో స్విమ్మింగ్ పూల్స్ కళకళలాడుతున్నాయి. రంగురంగుల ట్యూబ్‌లతో నీళ్లలో తేలియాడుతూ, ఒకరిపై ఒకరు నీళ్లు పోసుకుంటూ చిన్నారులు ఈత కొలనులో తమ సమయాన్ని ఉల్లాసంగా గడుపుతున్నారు. కొందరు తల్లిదండ్రులు చిన్నారులకు రక్షణగా ఉంటూ వారిలో ఉండే నీటి భయాన్ని పోగొడుతూ వారూ సైతం సేదతీరుతున్నారు. ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 9గంటల వరకు ఇందులో అమ్మాయిలకు, అబ్బాయిలకు వేర్వేరుగా బ్యాచెస్ నడుపుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆపరేషన్ సిందూర్ విజయాన్ని కాంక్షిస్తూ పూజలు

ఎల్బీనగర్, మే 9(ఆంధ్రజ్యోతి): భారత సైనికులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఆపరేషన్ సిందూర్‌లో భారత్ విజయం సాధించాలని కోరుకుంటూ ఎల్బీనగర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, గణపతి, సుదర్శన హోమాలు నిర్వహించారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాలతో శుక్రవారం ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజాధికాలు నిర్వహించారు. భారత సైనికులంతా ఆరోగ్యంగా ఉండి శత్రుదేశం పాకిస్థాన్‌కు తగు గుణపాఠం చెప్పాలని అర్చకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ గుంటి లక్ష్మణ్, కార్యనిర్వాహణాధికారి ప్రేమ్‌కుమార్‌రావు, ఆలయ అర్చకులు శివశ్రీ, డాక్టర్ పండరి శివశంకర్‌శాస్త్రి, చంద్రశేఖర్‌రావు, వామనరావు, ప్రసాద్, శ్రీధర్, రామ్మూర్తి, శ్రీహర్ష పాల్గొన్నారు.



ఎల్బీనగర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

భారత సైనికులు క్షేమంగా ఉండాలని..

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలోని ధ్యానాంజనేయస్వామి సన్నిధిలో శుక్రవారం రాష్ట్ర దేవాదాయ కమిషనర్ ఆదేశాల మేరకు భారతదేశ సైనికులు క్షేమంగా ఉండడంతో పాటు ఆపరేషన్ సిందూర్‌లో విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ ఆలయ వేద పండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. భారత జాతీయ పతాకాలను చేతపట్టి వారు సైనికులకు మద్దతుగా జైహింద్, జైశ్రీరామ్, జైజవాన్ అంటూ నినాదించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, వేద పండితులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



నాగోల్ ఇంద్రప్రస్థకాలనీలోని రామాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న సామ రంగారెడ్డి, కార్పొరేటర్ చింతల అరుణ తదితరులు

దేశం గర్వపడేలా ఉగ్రదాడికి ప్రతీకారం : రంగారెడ్డి

మన్సూరాబాద్ : పాకిస్థాన్‌పై ప్రధాని మోదీ ప్రోత్సాహంతో ఆపరేషన్ సిందూర్ పేరుతో దేశ సైనికుల ప్రతిదాడి యావత్ భారత్ గర్వపడేలా ఉందని బీజేపీ సీనియర్ నాయకుడు సామ రంగారెడ్డి పేర్కొన్నారు. ఉగ్రవాదంపై వీరోచితంగా పోరాడుతున్న భారత సైనికులు క్షేమంగా ఉండాలని, వారికి విజయం చేకూరాలని కాంక్షిస్తూ నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణ ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ పరిధిలోని ఇంద్రప్రస్థకాలనీలో గల రామాలయంలో పూజలు నిర్వహించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్‌యాదవ్, లయ పాల్గొన్నారు.

భారత సైన్యానికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలి

వనస్థలిపురం, మే 9(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌తో జరుగుతున్న పోరులో ప్రతి భారతీయుడు భారత సైన్యానికి అండగా ఉంటూ మన ఐక్యతను చాటాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శ్రీపురంకాలనీలోని ఛత్రపతి శివాజీ విగ్రహం నుంచి ఎస్కేడీనగర్ చౌరస్తా వరకు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు పెహల్గామ్‌లో దేశ పౌరులపై కాల్పులు జరిపి హత్య చేసిన దుర్ఘటనకు ప్రతీకారంగా భారతసైన్యం చేసిన మిస్సైల్స్ దాడి ప్రతి భారతీయుడికి గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎల్బీనగర్ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



సంఘీభావ ర్యాలీలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్ లచ్చిరెడ్డి



చిత్రా లేఅవుట్ పార్కులో భారత సైన్యానికి సంఘీభావ ప్రదర్శన చేపట్టిన ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

భారత సైన్యానికి సంఘీభావ ప్రదర్శన

ఎల్బీనగర్ : పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా సైన్యానికి సంఘీభావం తెలుపుతూ ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని చిత్రాలేఅవుట్ పార్కులో ఇంటర్నేషనల్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రదర్శన చేపట్టారు. ఉగ్రవాదంపై పోరులో భారత ప్రభుత్వం తీసుకునే అన్ని చర్యలకు ప్రతీ భారతీయుడు సంఘీభావం తెలపాలని చిత్రా లేఅవుట్ ఇంటర్నేషనల్ వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, కార్యదర్శి రామచంద్రారావు పిలుపునిచ్చారు. భారత సైన్యానికి దేశం యావత్తు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ మాజీ జాతీయ అధ్యక్షుడు మురళీమనోహర్, టి. చక్రపాణి, గంగాధర్‌రెడ్డి, క్లబ్ కోశాధికారి సత్యనారాయణ, రామచంద్రారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, స్వామరావు, హన్మంతరావు, వెంకట్, మల్లేష్ పాల్గొన్నారు.

దేశ కీర్తి ప్రతిష్ఠను పెంచిన మోదీ : నాగఫణిశర్మ

చంపాపేట, మే 9(ఆంధ్రజ్యోతి): భారతదేశ కీర్తి ప్రతిష్ఠలను ప్రధాని నరేంద్రమోదీ ఎంతో పెంచారని పద్మశ్రీ డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ అన్నారు. చంపాపేట డివిజన్ బైరామల్‌గూడలోని సువర్ణభారతి గోశాలలో తత్వం చారిటబుల్ ట్రస్ట్, ఆది శంకరాచార్య భక్త సమాజం సంయుక్తాధ్వర్యంలో గత నెల 28నుంచి నిర్వహించిన జగద్గురు ఆది శంకరాచార్య జయంతి ఉత్సవాలు శుక్రవారం వరకు విజయవంతంగా జరిగాయి. తత్వం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మశ్రీ పశర్లపాటి శ్రీనివాస బంగారయ్యశర్మ నేతృత్వంలో జరిగిన ఈ ఉత్సవాల ముగింపు రోజున పద్మశ్రీ మాడుగుల నాగఫణిశర్మ చేసిన ప్రవచనాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. భారతదేశ ప్రతిష్ఠను పెంచిన మోదీ, పాకిస్థాన్‌ను ఎదుర్కొన్న రీతిని ఆయన కవిత్వం రూపంలో భక్తులకు వినిపించారు. ఈ కార్యక్రమంలో ఆది శంకరాచార్య భక్త సమాజం అధ్యక్షుడు టి.రమేష్‌గుప్తా, కార్యదర్శి సతీష్ మాడుగుల నాగఫణిశర్మను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, భక్తులు పావని, రజిత, నాగేష్, వాణి, శర్వాణి, రవి పాల్గొన్నారు.



బైరామల్‌గూడలో ఆది శంకరాచార్య జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న పద్మశ్రీ డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ తదితరులు

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

వనస్థలిపురం, మే 9(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ ఎల్బీనగర్ ప్రధాన కార్యదర్శి ఎం.మద్దిలేటి కార్మికలోకానికి పిలుపునిచ్చారు. శుక్రవారం వనస్థలిపురం రెడ్ ట్యాంక్ వద్ద మున్సిపల్ సంఘం ఆధ్వర్యంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మద్దిలేటి మాట్లాడుతూ కార్మిక చట్టాలను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలు నశించాలని కోరుతూ ఈనెల 20న కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే సార్వత్రిక సమ్మెలో కార్మికులు, అసంఘటిత కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్మికులు పద్మమ్మ, భాగ్యమ్మ, ధనమ్మ, కలమ్మ, పరమేష్, దేవకమ్మ, బలరాం పాల్గొన్నారు.

ఎల్బీనగర్ : కార్మిక హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ సరూర్‌నగర్ సర్కిల్ కన్వీనర్ మల్లెపాక వీరయ్య, గోపీనాయక్‌లు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్ కూరగాయల మార్కెట్ వద్ద మే 20న దేశవ్యాప్తంగా జరపతలపెట్టిన కార్మిక సంఘాల సమ్మె వాల్‌పోస్టర్లను శుక్రవారం విడుదల చేశారు. కే.రాములు, ఎండీ సలావుద్దీన్, టి. మల్లేష్, శ్రీను, రవిస్వామి, కిరణ్, కార్తీక్ పాల్గొన్నారు.



దేశవ్యాప్త సమ్మె వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న సీఐటీయూ వీరయ్య, గోపీనాయక్ తదితర నేతలు

6కిలోల గంజాయి స్వాధీనం : ఇద్దరు స్మగ్లర్ల అరెస్టు

హైదరాబాద్ సిటీ, మే 9(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, గంజాయి రవాణాపై ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసుల స్పెషల్ డ్రైవ్ కొనసాగుతోంది. మలక్‌పేట్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ నిల్వ ఉంచారనే సమాచారంతో ఎస్‌హెచ్‌ఓ ఏ నరేందర్ పర్యవేక్షణలో సిబ్బంది దాడులు నిర్వహించి 6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న గంజాయి విలువ బహిరంగ మార్కెట్లో రూ. 3లక్షలు ఉంటుందని అంచనా వేశారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేట్ సంతోష్‌నగర్ ఈద్‌బజార్ ప్రాంతంలో నేపాల్‌కు చెందిన సూర్యసింగ్, రమేష్ బహదూర్ అనే ఇద్దరు వ్యక్తులు అద్దెకు ఉంటున్నారు. సులభంగా డబ్బు సంపాదనకు అలవాటుపడిన ఇద్దరూ.. ధూల్‌పేట్‌కు చెందిన అభిషేక్ సింగ్ వద్ద తరుచుగా గంజాయిని కొనుగోలు చేసి, మలక్‌పేట్ ప్రాంతంలో గుట్టుగా ఎక్కువ ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు సీఐ తెలిపారు. ఈ దాడిలో సీఐ నరేందర్‌తోపాటు ఎస్‌ఐలు సుజాత, శివచరణ్, కానిస్టేబుళ్లు శ్రీనివాస్‌లు, సురేందర్, ప్రసాద్, శంకర్, విక్రమ్‌లు పాల్గొన్నారు. గంజాయిని పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసిం, హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ కేఏబీ శాస్త్రీ, అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్‌రెడ్డి, ఈఎస్ పంచాక్షరీ, ఏఈఎస్ శ్రీనివాసరావు అభినందించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, మే 9(ఆంధ్రజ్యోతి): టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలోని మరమ్మతు పనుల కారణంగా శనివారం 11కేవీ లక్ష్మీనగర్, ఆర్టీఏ సలీంనగర్ ఫీడర్ల పరిధిలోని పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు, మలక్‌పేట ఫీడర్ పరిధిలోని పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 9.30 గంటల వరకు, చంచల్‌గూడ, సరస్వతీనగర్ ఫీడర్ల పరిధిలోని పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 10.30 గంటల వరకు, ఎంఎంహెచ్, అబ్బాస్ వాటర్ ట్యాంకు ఫీడర్ల పరిధిలోని పరిసర ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి 11గంటల వరకు, దోబీఘాట్, పర్వాత్ ఆస్పత్రి ఫీడర్ల పరిధిలోని పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5 గంటల వరకు, గడ్డిఅన్నారం, కాలడేరా ఫీడర్ల పరిధిలోని పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల వరకు, ఆనంద్‌నగర్ ఫీడర్ పరిధిలోని పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3.30 నుంచి 4 గంటల వరకు, శ్రీపురం, సంతోష్‌నగర్ ఫీడర్ల పరిధిలోని పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 4నుంచి 4.30 గంటల వరకు, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

తుర్కయంజాల్ సెక్షన్ పరిధిలో..

హయత్‌నగర్ : తుర్కయంజాల్ సెక్షన్ 11 కేవీ లైన్ విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ ప్రసారంలో అంతరాయం కలుగుతుందని తుర్కయంజాల్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీమెగాటౌన్ షిప్, పాటిగూడ, సూరజ్‌నగర్, లక్ష్మీగార్డెన్, కుర్మగూడ, వైఎస్‌ఆర్‌కాలనీ, తుర్కయంజాల్ ఓల్డ్ విలేజీ, మధ్యాహ్నం 3గంటల నుంచి 5 గంటల్లోపు సినర్జిహోమ్స్, ద్వారకానగర్, శోభానగర్, సిలికాన్‌నగర్, ఆఫిల్ సిటీ, ఏపీనగర్, వింటేజిహోమ్స్, యాదగిరిహోమ్స్ తదితర ప్రాంతాల్లో ప్రసారం ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చంపాపేట : చంపాపేట విద్యుత్ 11కేవీ ఫీడర్‌లో శనివారం వివిధ మరమ్మతుల కారణంగా ఉదయం 9:30గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఫీడర్ పరిధిలోని సాయిరాంనగర్‌కాలనీ, శిఖరా ఎన్‌క్లేవ్, నాగార్జునకాలనీ, ఆర్టీసీకాలనీ, భానునగర్, కేశవనగర్, సింగరేణికాలనీ, రాఘవేంద్రకాలనీలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

11కేవీ శ్రీనివాసనగర్ ఫీడర్‌లో..

చంపాపేట విద్యుత్ సెక్షన్ 11కేవీ శ్రీనివాసనగర్ ఫీడర్‌లో వివిధ మరమ్మతుల కారణంగా శనివారం సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఫీడర్ పరిధిలోని గ్రీన్‌పార్కుకాలనీ, శ్రీనివాసనగర్‌కాలనీ, సాయిరాంకాలనీ, తపోవన్‌కాలనీలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

సంతోష్‌నగర్ : టీఎస్ఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని 11కేవీ పోస్ట్ ఆఫీస్, హైకోర్టుకాలనీ, శివపార్వతి, విష్ణుథియేటర్, లక్ష్మారెడ్డిపాలెం, పెద్దఅంబర్‌పేట్ ఇండస్ట్రియల్, పెద్దఅంబర్‌పేట్‌టౌన్, ఆల్‌ఇండియారేడియో, విశాలాంధ్ర, చాణక్యపురి, నేతాజీనగర్, ఎల్బీనగర్, సిరీస్‌ఫీడర్, ఇందిరానగర్, రాఘవేంద్రకాలనీ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో నిర్వహణ పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని డీఈ తెలిపారు. 11కేవీ పోస్ట్ ఆఫీస్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి 10 గంటల వరకు, 11కేవీ హైకోర్టుకాలనీ, శివపార్వతి, విష్ణుథియేటర్, లక్ష్మారెడ్డిపాలెం, పెద్దఅంబర్‌పేట్ ఇండస్ట్రియల్, పెద్దఅంబర్‌పేట్‌టౌన్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు, 11కేవీ ఆల్‌ఇండియారేడియో, విశాలాంధ్ర ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి 12గంటల వరకు, 11కేవీ చాణక్యపురి, నేతాజీనగర్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, 11కేవీ ఎల్బీనగర్, సిరీస్‌ఫీడర్, ఇందిరానగర్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు, 11కేవీ రాఘవేంద్రకాలనీ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో సాయంత్రం 4గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.